DYNAMIC EDITION
వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
గురువారం, నవంబరు 9, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD



# ఐటీ దాడులకు భయపడం: రేవంత్ రెడ్డి

హైదరాబాద్ (వాయిస్ టుడే): కాంగ్రెస్ నేతల ఇళ్లు, కార్యాలయంపై ఐ.టి దాడుల విషయంలో టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఐ.టి దాడులకు కాంగ్రెస్ భయపడేది లేదు. పాలేరు అభ్యర్థిపై ఐ.టి అధికారులు పెద్దఎత్తున దాడులు చేస్తూ భయపెట్టాలని చూస్తున్నారు. ఇది బిఆర్ఎస్, బీజేపీ కలిసి చేస్తున్న రాజకీయ కుట్ర. ..ఇలాంటి రాజకీయ బెదిరింపులకు కాంగ్రెస్ నాయకులు భయపడరు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి రాష్ట్ర కాంగ్రెస్ అంత అండగా ఉంటుంది. ఓటమి భయంతోనే బిఆర్ఎస్, బీజేపీ కలిసి చేస్తున్న కుట్ర రాజకీయాలు. ఒక్క కాంగ్రెస్ నాయకులను ఐ.టి టార్గెట్గా చేసుకొని దాడులు చేస్తుందని ఆరోపించారు. గత వారం రోజుల నుంచి కాంగ్రెస్ నాయకుల ఇళ్లల్లో మాత్రమే ఐ.టి దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తోంది. బిఆర్ఎస్, బీజేపీ కలిసి చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలు అన్ని గమనిస్తున్నారు.




## ఆర్మూర్ కేటీఆర్ పర్యటనలో అపశ్రుతి

నిజామాబాద్ (వాయిస్ టుడే): నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో కేటీఆర్ పర్యటనలో అపశ్రుతి నెలకొంది, స్థానిక బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్ రెడ్డి నామినేషన్ సందర్భంగా ప్రచార రథంపై కేటీఆర్ వెళుతునప్పుడు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకులు వేసాడు. దాంతో వ్యాన్ పైనుంచి కేటీఆర్, ఎంపీ సురేష్ రెడ్డి, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ముందురు జారి పడ్డారు. మంత్రి కి స్వల్ప గాయాలు అయినట్లు సమాచారం.

# నామినేషన్ దాఖలు చేసిన అగ్రనేతలు







హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. గురువారం నాగు నేడు బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతంతా నామినేషన్లు దాఖాలు చేశారు.. గురువారం నాడు మంచి మూహూర్తం ఉండటంతో నామినేషన్ల ప్రక్రియ ఊపంకుంది. గజ్వేల్ లో గులాబీ అధినేత, సీఎం కేసీఆర్ గజ్వేల్ లో నామినేషన్ దాఖలు చేయగా.. సిద్దిపేటలో మంత్రి హరీష్ రావు నామినేషన్ దాఖలు చేశారు. గురువారం ఉదయం మంత్రి హరీష్ రావు కొండగట్టు అంజన్న స్వామిని దర్శనం చేసున్నారు. తరువాత సిద్ధిపేటకు చేరుకుని అక్కడి మోహిన్ పుర వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే నామినేషన్ల ప్రతాలపై సంతకాలు చేశారు. తరువాత భారీ ర్యాలీగా వెళ్లి సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ దాఖాలు చేశారు. మరోవైపు.. సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ నామినేషన్ వేశారు.ఉదయం 11:45 నిమిషాలకు సిరిసిల్లా ఆర్డిఓ కార్యాలయంలో నామినేషన్ వేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుడా గురువారం నామినేషన్ దాఖలు చేసారు. ఉదయాన్నే తల్లి లలితా వెంకటేశం యాదవ్ కాళ్ళను మొక్కి ఆశీర్వాదం పొందారు. వేద మంత్రాలతో మంత్రికి వేద పండితులు ఆశీర్వచనం చేసారు.తరువాత కుటుంబ సభ్యులతో బయలుదేరి నామినేషన్ దాఖలు చేసారు.



## కేసీఆర్ వస్తే ఒక్కడే రాడు, వెంబడి చాలా వస్తయ్..
### నియోజకవర్గ రూపురేఖలే మారిపోతయ్

కామారెడ్డి: కేసీఆర్ వస్తే ఒక్కడే రాడని, వెంబడి చాలా వస్తాయని కామారెడ్డిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ అన్నారు. తాను కామారెడ్డి నుంచి పోటీ చేస్తే ఈ నియోజకవర్గ రూపురేఖలే మారిపోతాయని చెప్పారు. ఏడాదిన్నర, రెండేళ్లలో కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు బ్రహ్మాండంగా నీళ్లు తెచ్చి చూపిస్తానని, ఇది నా వాగ్ధానమని సీఎం శపథం చేశారు. కాబట్టి ప్రజలు ఎవరికి ఓటు వేస్తే మేలు జరుగతదో బాగా ఆలోచించి ఓటేయాలని ఆయన కోరారు.

'పోయిన ఎన్నికల్లో గంప గోవర్ధన్‌గారు ఇక్కడి నుంచి పోటీ చేసినప్పుడు కామారెడ్డిని జిల్లా చేస్తం అని హామీ ఇచ్చిన. ఆ మేరకు కామారెడ్డిని జిల్లా చేసుకున్నం. మెడికల్ కాలేజీని కూడా తెచ్చుకున్నం. జిల్లాలోని నాయకులతోపాటు గంప గోవర్ధన్ గారు తనను ఇక్కడి నుంచి పోటీ చేయాలని కోరారు. అందుకే వాళ్ల కోరిక మేరకే ఇయ్యాల ఇక్కడి నుంచి పోటీ చేసిన. కేసీఆర్ వస్తే ఒక్కడే రాడు. వెంబడి చాలా వస్తయ్. కేసీఆర్ వెంట కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు ఏడాదిన్నర, రెండేళ్లలోపు నీళ్లు వచ్చి పారుతయ్. ఇది నా వాగ్ధానం. పెండింగ్‌లో ఉన్న కాళేశ్వరం పనిని ఆగమేఘాల మీద పూర్తి చేసి ఈ నియోజకవర్గానికి, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి బ్రహ్మాండంగా నీళ్లు తెచ్చి చూపిస్తా' అన్నారు. 'కేసీఆర్ వెంట చాలా వస్తయ్. విద్యుత్ సంస్థలు వస్తయ్. ఎడ్యుకేషన్ సంస్థలు వస్తయ్. పరిశ్రమలు వస్తయ్. మీరు ఊహించని అభివృద్ధి జరుగుతది. కామారెడ్డి పట్టణంతోపాటు ఇక్కడి పల్లెల రూపురేఖలు కూడా మారుతయ్. మీరు ఒకటి రెండు సార్లు బాగా ఆలోచించి ఓటేయాలి. ఎవరికి ఓటేస్తే నియోజకవర్గానికి, రాష్ట్రానికి మేలు జరుగుతదో బేరిజు వేసుకోవాలి. అంతేతప్ప ఆగమాగమై ఓటు వేయొద్దు' అని సీఎం సూచించారు.

## బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్



హైదరాబాద్ (వాయిస్ టుడే): బీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉన్నాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో వెల్లువలా చేరుతున్నారు. తాజాగా మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంభాని చంద్రశేఖర్ ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ..తన 50 ఏళ్ల కాంగ్రెస్ జీవితానికి కాంగ్రెస్ పార్టీలో తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు, తాను ఖమ్మం జిల్లాతో పాటు సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య గెలుపునకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.



# బీసీ నినాదం... జనసేన చరిష్మాపైనే ఆశలు

హైదరాబాద్, నవంబర్ 9, (వాయిస్ టుడే):

ప్రధానమంత్రి నరేంద్రమోదీ బీసీ ఆత్మగౌరవ సభలో బీజేపీ గెలుస్తుంది.. బీసీని సీఎంను చేస్తుందని ప్రకటించారు. అయితే తెలంగాణలో రాజకీయ పరిస్థితులు మోదీ వ్యక్తం చేసినంత కాన్ఫిడెంట్‌గా బీజేపీకి లేవని చెప్పుకోవచ్చు. ప్రధాన పోటీదారుల్లో బీజేపీ లేదని అనేక సర్వేలువెల్లడించాయి. అయితే బీజేపీ మాత్రం ప్లాన్ బీతో ఎవరూ ఊహించని విధంగా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఆ ప్లాన్ బీ ఏమిటన్నదాని సంగతి పక్కన పెడితే.. బీసీ సీఎం విషయంలో బీజేపీ అంత నమ్మకంగా ఉండటానికి కారణం ఏమిటి ? పవన్ కల్యాణ్‌తో పొత్తు కోసం గట్టిగా ప్రయత్నించాల్సిన అవసరం ఏముంది ? బీసీ సీఎం, పవన్ పొత్తు గేమ్ ఛేంజర్ అని ప్రధాని మోదీ గట్టిగా నమ్ముతున్నారని ఆయన ప్రసంగాన్ని చూస్తే అర్థం అవుతుంది. మరి బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభ తర్వాత తెలంగాణ బీసీల్లో బీజేపీ కోరుకున్నంత కదలిక వస్తుందా ?తెలంగాణ బీజేపీ బీసీ నినాదంపై ఎక్కువ ఆశలు పెట్టుకున్నట్లుగా ప్రధాని మోదీ ప్రసంగాన్ని చూస్తే అర్థమవుతుందని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. 2014లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేశాయి. తెలుగుదేశం పార్టీ బీసీ నినాదాన్ని అందుకుంది. పార్టీలో ఉన్న బీసీ నేతలకు పూర్తి స్థాయిలో అన్ని వర్గాల నుంచి అనుకూలత రాదని.. బీసీ సంక్షేమ సంఘం నేతగా ఉన్న ఆర్ కృష్ణయ్యను పార్టీలో చేర్చుకుని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. ఎల్బీ నగర్ అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకున్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీ ఐదు స్థానాలను గెల్చుకోగా.. టీడీపీ 14 చోట్ల విజయం సాధించింది. బీసీ సీఎం నినాదం ఇంత పవర్ ఫుల్ గా ఉంటుందని బీజేపీ నిర్ణయించుకుని ఇప్పుడు అదే వ్యూహం అమలు చేసిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అప్పట్లో తెలుగుదేశం మేజర్ ఫోర్స్ గా ఉంది. ఇప్పుడు పూర్తిగా చతికిలపడిపోయింది. అసలు పోటీ నుంచి విరమించుకుంది. కానీ జనసేన రూపంలో బీజేపీకి కూటమి పార్టీ లభించింది. పవన్ కల్యాణ్ కూడా ఎన్నో కొన్ని సీట్లు ఇచ్చినా పర్వాలేదనుకుని అంగీకరించారు. పవన్ కల్యాణ్‌కు మున్నూరు కాపు వర్గంతో పాటు ఆయన ఫ్యాన్స్ అన్ని వర్గాల్లోనూ ఉంటారని



ఇది కలసి వస్తుందని అంచనా వేస్తున్నారు. రెండు పార్టీల కూటమి తెలంగాణను దున్నేస్తుందని ఆ పార్టీ నేతలేమీ ఆశలు పెట్టుకోవడం లేదు కానీ.. హంగ్ వస్తే కింగ్ మేకర్ అవుతామన్న నమ్మకంతో ఉన్నట్లుగా భావిస్తున్నరు. అందుకే పవన్ తో పొత్తు విషయంలో బీజేపీ పెద్దలు ఎక్కువ్వసక్తి చూపించారని అంటున్నారు. 2014 తరహాలోనే ఇప్పుడు రెండు పార్టీలు కలిసి ఇరవై వరకూ సీట్లు సాధిస్తే... హంగ్‌లో కింగ్ అవడం ఖాయమన్న నమ్మకంతో బీజేపీ నేతలు ఉన్నట్లుగా తెలుస్తోంది. తెలంగాణలో బీసీలు నిర్ణయాత్మక శక్తి.కానీ వారంతా ఏకతాటిపైన లేరు. బీసీ కులాలన్నీ సమైక్యంగా ఉంటే.. వారు అజేయమైన శక్తి . కానీ రాజకీయాల్లో ఏ కులం అయినా కుల సమూహం అయినా ఏకతాటిపైన ఉండదు. ఓ పార్టీపై ఎక్కువ అభిమానం చూపించవచ్చు కానీ..అన్ని పార్టీల్లో అన్ని కులాల వారూ ఉంటారు. అలాగే బీసీలు కూడా వివిధ పార్టీల మద్దతుదారులుగా ఉంటారు. వీరిలో ఎంత మందిని బీసీ సీఎం నినాదంతో బీజేపీ తన వైపు మల్చుకుంటుందన్నది కీలకం. పవన్ మద్దతుతో బీసీ సీఎం నినాదానికి బలం చేకూరిందని బీజేపీ నమ్ముతోంది. ఎంత ఎక్కువ సెంటిమెంట్ రాజేస్తే అంత ఎక్కువ లాభం అని అనుకుంటోంది. కానీ బీజేపీ అనుకున్నంతగా సెంటిమెంట్ వర్కవుట్ అయిందా లేదా అన్నదే ప్రశ్న.



## దుబ్బాకలో కొత్త ప్రభాకర్ రెడ్డి నామినేషన్
### అంబులెన్సులో ఆర్వో కార్యాలయానికి

దుబ్బాక (వాయిస్ టుడే): బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాకలో నామినేషన్ దాఖలు చేశారు. సికింద్రాబాద్ యశోధ హాస్పిటల్ నుంచి అంబులెన్సులో దుబ్బాకకు చేరుకున్న ఆయన.. వీల్ చైర్‌లో వెళ్లి ఆర్వో కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతకుముందు దుబ్బాక పట్టణంలో భారీ ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి హరీశ్, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎల్పీ నేత భట్టి విక్రమార్క నామినేషన్ దాఖలు



మధిర (వాయిస్ టుడే): సిఎల్పీ నేత భట్టి విక్రమార్క గురువారం నామినేషన్ దాఖలు చేసారు. అంతకుముందు వైరా శబరి నగర్ లోని అయ్యప్ప దేవాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుని వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆ తర్వాత స్థానిక సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. భట్టి విక్రమార్క స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. కృష్ణాజిల్లా నెమలి గ్రామంలో శ్రీకృష్ణ దేవాలయాన్ని భట్టి విక్రమార్క గారు కుటుంబ సమేతంగా సందర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. అక్కడి నుంచి నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చారు.

## కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటిలో ఐటీ దాడులు

ఖమ్మం (వాయిస్ టుడే): ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటిలో ఐటీ దాడులు కొనసాగుతున్నాయి.సుమారు ఏడు గంటలుగా అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పొంగులేటి నివాసంతో పాటు పాలేరులోని క్యాంపు కార్యాలయంలో అధికారులు ఏకకాలంలో దాడులు కొనసాగుతున్నాయి.ఎనిమిది వాహనాల్లో వచ్చిన అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఖమ్మంతో పాటు హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నివాసంలోనూ ఐటీ అధికారులు సోదాలు చేశారు.ఈ క్రమంలో పొంగులేటి సిబ్బంది ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే పొంగులేటి నామినేషన్ దాఖలు చేసే సమయంలో కావాలనే ఐటీ దాడులు చేస్తుందని కాంగ్రెస్ కార్యకర్తలు మండిపడుతున్నారు.



# దాడులకు భయపడను: పొంగులేటి

## బీఆర్ఎస్, బీజేపీ కలిసే వున్నాయి



ఖమ్మం(వాయిస్ టుడే): ఖమ్మం రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేసిన అనంతరం మీడియా సమావేశంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. పొంగులేటి మాట్లాడుతూ ఐటీ దాడుల ముసుగులోనాలుగు వందల మంది అధికారులు మా ఇంట్లో తనిఖీలకు వచ్చారు. రెండు రోజుల ముందే వివిధ మీడియా ల ద్వారా నామినేషన్ వేస్తానని చెప్పాను.అది దృష్టిలో ఉంచుకుని దాడులు చేశారు. తనికీలకు వచ్చిన అధికారులు బయటకు పంపము అని కూర్చున్నారు. చీప్ ఎలక్షన్ కమిషన్ కు ఘటన పై వివరించాము. పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు మా ఇంటి దగ్గర కు తరలివచ్చారు. పై అధికారులు రాజకీయ నాయకులతో సంప్రదించిన తరువాత నాకు బయటకు వెళ్ళడానికి రెండు గంటల వరకు టైమ్ ఇచ్చారు. కేంద్ర ఎన్నికల కమిషన్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఒక్కటే అడుగుతున్నా. అరచేతిని అడ్డం పెట్టి సూర్యకాంతి ని ఆపలేరు.అలాగే కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని మీరు దోచుకున్న డబ్బును బయటకు తీస్తుందని కాంగ్రెస్ క్యాండిట్ లను బయపెట్టాలని బీజేపీ, బీఆర్ఎస్ రెండు కలిసి చేస్తున్నాయి. ప్రజాస్వామ్యం లో ఏ వ్యక్తి అయినా ఎక్కడ నుంచి అయినా పోటీ చేసే హక్కు ఉంది. నేను నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం మీరు చూస్తున్నారు.. బీజేపీ గెలవకపోయిన కాంగ్రెస్ గెలవకూడదనే ఇదంతా చేస్తుంది. వారి తాటాకు చప్పుళ్లకు నేను భయపడేది లేదు. ఈరోజు నాకు ఎన్నికల ప్రచారం ఉంది ఒక్క అడుగు కూడా వెనక్కు వేయను నాలుగు గంటలకు ప్రచారానికి వెళ్తాను. ఏం చేస్తారో చేసుకోండి తెలంగాణ రాష్ట్రం లో దొరల పరిపాలన కు మద్దతు పలుకుతున్న బీజేపీ ని ఎండగట్టడం ఖాయం మీరు ఆత్మ పరిశీలన చేసుకొని మీ ప్రవర్తన మార్చుకోండని అన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
గురువారం, 9 నవంబరు, 2023

# ఇది విజయోత్సవ ర్యాలీలా ఉన్నది.. షకీల్ నామినేషన్ ర్యాలీలో ఎమ్మెల్సీ కవిత





బోధన్ (వాయిస్ టుడే): దేశమంతా గులాబీ హవా నడుస్తున్నదని తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని బోధన్ నియోజకవర్గంలో గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ సందర్భంగా బోధన్ పట్టణంలో తీసిన ర్యాలీలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. షకీల్‌ను మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రస్తుతం దేశమంతటా గులాబీ హవా నడుస్తున్నదని, రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీదే విజయమని అన్నారు. షకీల్ నామినేషన్ ర్యాలీని చూస్తుంటే విజయోత్సవ ర్యాలీలా అనిపిస్తున్నదని ఆమె అభివర్ణించారు. ఈ జోష్ షకీల్ విజయం ఖాయమని చెబుతోందని అన్నారు.



## నామినేషన్ దాఖలు చేసిన మధు యాష్కి

రంగారెడ్డి (వాయిస్ టుడే): ఎల్బీనగర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మధు యాష్కీ గౌడ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. హయత్ నగర్ లో తల్లి సులోచన ఆశీస్సులు తీసుకొని, కొత్తపేట్ లోని ప్రసన్న మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసారు. తరువాత , తన నామినేషన్ పత్రాలను ఆర్వో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. మధు యాష్కి మాట్లాడుతూ యుద్ధం మొదలైంది, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. హయత్ నగర్ నుండి వేల సంఖ్యలో బైక్లు, కార్లతో స్వచ్ఛందంగా ర్యాలీ ప్రారంభించారు. ప్రజల గుండె నిండా మూడు రంగుల జెండా, కాంగ్రెసే వారందరికీ అండ అని అన్నారు. ఎల్బీనగర్ అంతా తిరంగమయం. ప్రత్యర్థి పార్టీల నేతలు అయోమయం. రాస్తా ఏదైనా చౌరస్తా ఏదైనా ఒకటే నినాదం. అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఇంచార్జ్ జక్కిడి ప్రభాకర్ రెడ్డి, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వజీర్ ప్రకాష్ గౌడ్,తీన్మార్ మల్లన్న,న్యాయవాది చలకాని వెంకట్ యాదవ్,కాంగ్రెస్ ముఖ్య నాయకులు,మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు

## పోటీనుంచి తప్పుకున్న నీలం సుధాకర్



హైదరాబాద్ (వాయిస్ టుడే): కామారెడ్డిలో టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పోటీ చేయాలనుకున్న వైఎస్సార్ తెలంగాణ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నీలం సుధాకర్ పోటీనుంచి తప్పుకున్నారు. పార్టీ అధినేత్రి షర్మిల సుధాకర్ ను గురువారం పిలిచి మాట్లాడారు. పోటీ నుంచి విరమించాలని సూచించారు. దాంతో, అధినేత్రి ఆదేశాల మేరకు పోటీ నుంచి తప్పుకుని కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తామని నీలం సుధాకర్ ప్రకటించారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల రాళ్ల యుద్ధం



రంగారెడ్డి (వాయిస్ టుడే): ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బి ఆర్ ఎస్ , కాంగ్రెస్ పార్టీల మధ్య రాళ్ళ యుద్ధం జరిగింది. గురువారం నాడు నియోజకవర్గంలో ఒకే సారి కాంగ్రెస్ పార్టీ , బి ఆర్ ఎస్ పార్టీల భారీ ర్యాలీలు తీయడంతో వివాదం మొదలయింది. ర్యాలీ వెళ్తుంటే ఒక పార్టీ పై మరొక పార్టీ నాయకులు , కార్యకర్తల పై రాల్లు విసుకురుకున్నారు. ఘటనలో ఇరుపార్టీల నాయకులకు కార్యకర్తల కు తీవ్ర గాయాలు అయ్యాయి. కొందరు పోలీసులకు కుడా గాయాలయినట్లు సమచారం.



## డీలర్ దయాకర్.. డాలర్ దాయకర్ అయ్యాడు..
### పాలకుర్తి సభలో రేవంత్

జనగామ (వాయిస్ టుడే): పాలకుర్తి గడ్డకు ఒక చరిత్ర ఉందని.. పోరాట పటిమ ఉందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలకుర్తిలో ఏర్పాటు చేసిన సభలో రేవంత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను చూస్తుంటే దొరల గడీలను బద్దలు కొట్టడం ఖాయమనిపిస్తోందన్నారు. ఒకనాడు డీలర్‌గా ఉన్న ఎర్రబెల్లి దయాకర్ రావు ఇప్పుడు డాలర్ దయాకర్ రావు అయ్యారని వ్యాఖ్యలు చేశారు. ఎర్రబెల్లి దయాకర్ రావు దందాలు చేస్తే... ఝాన్సీ రెడ్డి కుటుంబం పేదలకు సేవలు చేశారని తెలిపారు. ప్రజలకు సేవ చేసేందుకు కాలేజీలు, ఆసపత్రుల కోసం 80 ఎకరాల భూమి కొంటే దయాకర్ రావు లిటిగేషన్లు పెట్టి ఇబ్బందులు పెట్టారని మండిపడ్డారు. ఝాన్సీ రెడ్డికి పౌరసత్వం రాకుండా అడ్డుకున్నారన్నారు. దయాకర్ రావు నమ్మక ద్రోహి... మిత్ర ద్రోహి అంటూ విరుచుకుపడ్డారు. శత్రువులతో చేతులు కలిపి, కుట్రలు చేసి తనను జైలుకు పంపారని.. కాంగ్రెస్ కార్యకర్తలపై దయాకర్ రావు పెట్టిన అక్రమ కేసులను ఒక్క కలం పోటుతో తొలగిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో పాలకుర్తిలో ఈ దొరను... తెలంగాణలో ఆ దొరను ప్రజలు ఈ బొంద పెట్టడం ఖాయమని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు.

## సూర్యాపేటలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం



సూర్యాపేట (వాయిస్ టుడే): మంత్రి జగదీష్ రెడ్డి సూర్యాపేట నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన నామినేషన్‌కు సూర్యాపేట నియోజకవర్గం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. సూర్యాపేటలో అభివృద్ధిని కొనసాగించడం కోసం తనను గెలిపించడానికి, మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు సీట్లు డిక్లేర్ చేసుకోకపోవడంతో ఆ పార్టీ పరిస్థితి ఏంటో తెలుస్తోందన్నారు. సూర్యాపేటలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎక్కడైనా ఒక్క నిమిషం కరెంటు లేదని చూపడానికి వైర్లు పట్టుకోడానికి తాను సిద్ధమని, రేవంత్ రెడ్డి సిద్ధమా? అని సవాల్ చేశారు. కర్ణాటక లో19 గంటలు కరెంటు ఇస్తున్నామంటున్న విషయంలో తాను వైర్లు పట్టుకోవడానికి సిద్ధమని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు.

## మీకు ఓటడిగే హక్కెక్కడిది?
### వరంగల్ గడ్డ కాంగ్రెస్ అడ్డా
### నాయిని రాజేందర్ రెడ్డి



వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికల పోరు హెూరాహెూరీగా కొనసాగుతుంది. పశ్చిమ నియోజకవర్గంలో త్రిముఖ పోరు కొనసాగుతున్న పరిస్థితి ఉంది. ఎంతో కాలంగా జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తూ కీలకంగా వ్యవహరించిన నేతలు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో పోటీ పడుతున్న క్రమంలో రాజకీయం రసవత్తరంగా మారింది. వరంగల్ కాంగ్రెస్ పార్టీ నుండి నాయిని రాజేందర్ రెడ్డి, బి ఆర్ ఎస్ నుండి దాస్యం వినయ్ భాస్కర్, బిజెపి నుండి పద్మా రెడ్డి హెూరాహెూరీగా ఎన్నికల పోరులో తలపడుతున్నారు. అయితే ప్రచారంలో తమదైన దూకుడును కొనసాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి వన్ఇండియా ప్రతినిధితో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## సురేఖను చూస్తే వైఎస్సార్ ను చూసినట్టే.. తూర్పులో గెలిచేది మేమే: కొండా మురళి!!



ఉమ్మడి వరంగల్ జిల్లా మొత్తంలో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. వరంగల్ తూర్పు నియోజకవర్గం నుండి కొండా సురేఖ ఎన్నికల బరిలో నిలిచి సాగిస్తున్న ప్రచారమే దీనికి పెద్ద కారణం. వరంగల్ తూర్పు నియోజకవర్గం లో ఈసారి కాంగ్రెస్ జెండా ఎగరవెయ్యాలని సంకల్పంతో ఉన్న కొండా సురేఖ వ్యూహాత్మకంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. కొండా సురేఖ తరఫున కొండా మురళి కూడా ప్రచార పర్వంలో పాల్గొంటూ ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.అయితే ఈ దఫా ఎన్నికలలో కొండా మురళి కూడా పోటీ చేస్తారని భావించిన వేళ తాను ఎన్నికలలో పోటీ చేయకపోవడం వెనుక కారణాన్ని కొండా మురళి వన్ఇండియా తో వెల్లడించారు.

## సీపీఐ జిల్లా కార్యాలయానికి తుమ్మల



ఖమ్మం (వాయిస్ టుడే): సీపీఐ జిల్లా కార్యాలయానికి మాజీ మంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు వెళ్లారు. పొత్తులో భాగంగా సీపీఐ నేతలను తుమ్మల మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా 10 స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు ఐక్యంగా పని చేయాలన్నారు. కొత్తగూడెంలో సీపీఐ రాష్ట్ర నాయకులు కూనంనేని సాంబశివరావు గెలుపునకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలన్నారు . ఖమ్మంలో తన గెలుపునకు సీపీఐ శ్రేణులు సహకరించాలన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్ర, దేశ రాజకీయాలకు నాంది కావాలని తుమ్మల పేర్కొన్నారు.

## పార్టీ గుర్తు కేటాయించకుండా వేధింపులు.. సింబల్ కోసం దీక్ష చేయాలా?



న్యూఢిల్లీ: పార్టీ గుర్తు కేటాయించకుండా అధికారులు వేధిస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలిసిన కేఏ పాల్ ఆపై మీడియాతో మాట్లాడుతూ..సెప్టెంబర్‌లోనే అన్ని డాక్యుమెంట్లు ఇచ్చిన ఇంత వరకు గుర్తు కేటాయించలేదన్నారు. పార్టీ యాక్టివ్2గా ఉన్న యాక్టివ్‌గా లేదని చెప్తున్నారన్నారు. ఎన్నికల సంఘాన్ని కేసీఆర్ నడుపుతున్నారో, ఎన్నికల కమిషనర్ నడుపుతున్నాడో అర్థం కావడంలేదని విమర్శించారు. పోటీ చేయని వైస్సార్ తెలంగాణ పార్టీకి కూడా గుర్తు కేటాయించారని.. కానీ తమకు కేటాయించడం లేదని మండిపడ్డారు. తెలుగు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని సర్వేలు స్పష్టంగా చెప్తున్నాయన్నారు. నామినేషన్లకు రేపే చివరి తేదీ అయిన సింబల్ ఇవ్వడం లేదన్నారు. తమ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు వెళ్తే సింబల్ ఏంటి అని అడుగుతున్నారన్నారు. తనకు ఎందుకు ఇంతలా నరకం చూపిస్తున్నారో అర్థం కావడం లేదని.. సింబల్ కోసం నిరాహారదీక్ష చేయాలి? అని ఆయన ప్రశ్నించారు.

హెలికాప్టర్, రింగ్ గుర్తుల్లో ఏది కేటాయిస్తారో చెప్పడం లేదన్నారు. ఆరు నెలలుగా ఇస్తున్నామని చెప్తున్నారు తప్ప కేటాయించడం లేదన్నారు. "చట్టాలు మారాలంటే నాలాంటి వాడు ఎంపీ అవ్వాలి.. నా పోరాటంతోనే వైజాగ్ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపేసాను" అని చెప్పుకొచ్చారు. ప్రజా శాంతి పార్టీకి గుర్తు వెంటనే కేటాయించి, నామినేషన్లకు మరో రెండు రోజులు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా శాంతి పార్టీకి సింబల్ ఎందుకు ఇవ్వడం లేదో ఎలక్షన్ కమిషన్ సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని.. ప్రచారం చేసేందుకు సమయం కేటాయించాలనే పోటీకి దూరంగా ఉన్నట్లు కేఏ పాల్ వెల్లడించారు.

# మారుతున్న బీజేపీ, బీఎస్పీ స్వరం




హైదరాబాద్, నవంబర్ 9, (వాయిస్ టుడే): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీలు హెూరాహెూరీగా ప్రచారం చేస్తున్నాయి. విజయం కోసం వ్యూహ, ప్రతివ్యూహాలతో ప్రత్యర్థులపై పైచేయి సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అగ్రనేతల పర్యటనలు, ప్రచారాలు హెూరెత్తిస్తున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి రోజు మూడు నాలుగు ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొంటున్నారు. అటు కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రచారంలో దూకుడు పెంచారు. నియోజకవర్గాల వారీగా ప్రచారం చేస్తున్నారు. కాషాయ పార్టీ నేతలు వరుసబెట్టి సభలు నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నారు. ప్రధానమంత్రి మోడీ బీసీ గర్జన సభ తర్వాత క్యాంపెయిన్ లో మరింత వేగం పెంచాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా పార్టీల అగ్రనేతలు ప్రచారం కోసం హెలికాప్టర్లను సిద్ధం చేసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ విధంగా హెలికాప్టర్ల ద్వారా రాష్ట్రాన్ని చుట్టేసేందుకు రెడీ అవుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని నియోజకవర్గాలను చుట్టేయడమే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల్లో దూకుడుగా వ్యవహరించాల్సిన కమలం పార్టీ నేతల స్వరాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి నిజామాబాద్ ఎంపీ, కోరుట్ల బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ స్టైల్ మార్చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. నిన్నటి వరకు కేసీఆర్, కేసీఆర్ కుటుంబంపై ఒంటి కాలుతో లేచిన నేతలు, ఇపుడు పూర్తి రివర్స్ లో వ్యవహరిస్తుండటంలో ప్రజల్లో కొత్తం చర్చ మొదలైంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న క్రమంలో బిజెపి ఎంపీ అరవింద్, సీఎం కేసీఆర్ పై ప్రశంసలు కురిపించడం అందర్నీ ఆశ్చర్యపడేసింది.ఆరు నెలల క్రితం వరకు తెలంగాణ లో బిఆర్ఎస్-బిజెపిల మధ్యే అసలైన పోటీ ఉంటుందని, ఈసారి బిజెపికే ప్రజలు పట్టం కడతారని అంత భావించారు కానీ ఒక్కసారిగా అంత తారుమారైంది. తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కంటే సీఎం కేసీఆరే మంచోడని వ్యాఖ్యానించారు. ఎప్పుడూ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే అరవింద్ రేవంత్ రెడ్డి కంటే సీఎం కేసీఆర్ మంచోడని అనడం రాజకీయవర్గాల్లో ఆసక్తి రేపుతోంది. మరోవైపు రాష్ట్రంలో మార్పు అంటే పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టు కాకూడదన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. బీఆర్ఎస్ పోయి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పరిస్థితి అంతేనని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ రెండు పార్టీల డీఎన్ఏ ఒక్కటేనని, అవినీతి, అక్రమాల్లో కవల పిల్లల వంటివని విమర్శించారు. బీజేపీ నేతల వాయిసుల్లో మార్పు రావడానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ వరుసగా ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహిస్తున్నారు. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఏ నియోజకవర్గానికి వెళ్లినా ఎక్కడా కూడా బీజేపీ నేతలపై విమర్శలు చేయడం లేదు. కాషాయ పార్టీని పల్లెత్తు మాట అనడం లేదు. ఇంకా చెప్పాలంటే బీజేపీ ప్రస్తావనే తీసుకురావడం లేదు. ఇప్పటి దాకా కేసీఆర్ పాల్గొన్న అన్ని సభల్లోనూ ప్రధాని కాంగ్రెస్ పాలనపై తీవ్రంగా విమర్శలు చేశారు. ఇప్పటికే 60 సంవత్సరాలు అధికారం ఇచ్చారని, మళ్లీ ఆ పార్టీకి ఇస్తే ప్రజలకు నష్టం చేకూర్చే నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శిస్తున్నారు.కాంగ్రెస్ వస్తే ధరణి, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు వంటి పథకాలను తీసి వేస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ టార్గెట్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బీజేపీ నేతలపై ఎలాంటి విమర్శలు, ఆరోపణలు చేయకపోవడంతో బీజేపీ నేతలు కూడా స్వరం మార్చేశారు. కేసీఆర్ పై ప్రశంసలు కురిపిస్తూ కొత్త రాగం అందుకుంటున్నారు. కేసీఆర్ పై ప్రశంసలు కురిపిస్తే కొన్ని సానుభూతి ఓట్లు పడతాయన్న ఆలోచనతో బీజేపీ నేతలు స్వరం మార్చేశారని జనం చర్చించుకుంటున్నారు.